క్లుప్తంగా

పేదలకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

జగ్గంపేట: మామిడాడలో సదాశివానంద యోగ జ్ఞానాశ్రమంలో బ్రహ్మర్షి సద్గురు పరమపితా వాల్మీకి స్వామి శివానంద పరమహంస జయంతిని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సొసైటీ మాజీ అధ్యక్షురాలు జ్యోతుల మణి పాల్గొని వృద్ధులకు, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన భారీ అన్న సమారాధనకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పసగడుగుల బాబూరావు, కోన బాబూరావు, బొడ్డేటి సుమన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బెయిల్‌పై సోషల్ మీడియా కన్వీనర్ విడుదల

జగ్గంపేట: జగ్గంపేట సోషల్ మీడియా కన్వీనర్ కాపారపు వెంకటరమణ శుక్రవారం బెయిల్‌పై విడుదలయ్యారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూపై సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టింగ్‌లు పెట్టారనే ఆరోపణపై జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ అరెస్ట్ చేశారు. పెద్దాపురం సబ్ జైల్లో ఉన్న రమణ 30 రోజుల అనంతరం బెయిల్‌పై విడుదలయ్యారు. ఆయనకు వైఎస్సార్ సీపీ యువనేత తోట రాంజీ, పార్టీ మండల అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, లీగల్ సెల్ కన్వీనర్ గుల్లా ఏడుకొండలు స్వాగతం పలికారు.

సైబర్ నేరాలపై అవగాహన

గండేపల్లి: నీలాద్రిరావుపేటలోని శ్రీకిరణ్ ప్రైవేటు స్కూల్లో శుక్రవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ వైఆర్కే శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులంతా స్నేహపూరిత వాతావరణంలో విద్యనభ్యసించాలని, సెల్ ఫోన్లో వచ్చే అపరిచిత మెసెజ్‌లను ఓపెన్ చేయకూడదని చెప్పారు. సైబర్ క్రైమ్ నేరాలు, మోసాలపై జాగ్రత్తలను వివరించారు. గండేపల్లి ఎస్సై యూవీ శివనాగబాబు, స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మీకాంతం అన్నారు. ధర్మవరలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం లోడుతో లారీ బోల్తా



తమ్మయ్యపేట రహదారిపై బోల్తా పడిన లారీ

తొండంగి: బెండపూడి పంచాయతీ తమ్మయ్యపేట శివారు జాతీయ రహదారిపై శుక్రవారం ధాన్యం లోడుతో వెళుతున్న లారీ బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సీపట్నం నుంచి గురువారం రాత్రి ధాన్యం బస్తాల లోడుతో లారీ పిఠాపురం వెళ్లేందుకు బయలుదేరింది. శుక్రవారం తెల్లవారు జామున తమ్మయ్యపేట శివారు జాతీయ రహదారిపై విద్యుత్ సబ్‌స్టేషన్ జంక్షన్ వద్దకు వచ్చే సరికి లారీ అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. రాహదారికి అడ్డంగా పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. హైవే పెట్రోలింగ్ సిబ్బంది, ఎన్‌హెచ్ఏఐ సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, క్రేన్ సహాయంతో లారీని పక్కకు తొలగించారు. లారీలోని ధాన్యం బస్తాలను మరో వాహనంలోకి ఎక్కించారు. దీనిపై తొండంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు మాలల మహాగర్జన



మహాగర్జన ప్రచార పోస్టర్‌ను విడుదల చేసిన జేఏసీ నాయకులు

తొండంగి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆదివారం గుంటూరులో జరిగే మాలల మహాగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు పిలుపు నిచ్చారు. మాలల మహాగర్జన కార్యక్రమానికి సంబంధించి ఎ.కొత్తపల్లి అంబేడ్కర్ విగ్రహం వద్ద సమావేశం నిర్వహించారు. మాలలు ఉన్న ప్రతి గ్రామం నుంచి 50 మందికి పైగా గుంటూరు సభకు తరలివెళ్లాలని నిర్ణయించారు. అనంతరం మహాసభ పోస్టర్‌ను విడుదల చేశారు. జేఏసీ నాయకులు తంతటి కిరణ్‌కుమార్, పెయ్యల సూరిబాబు, బండి చిట్టిబాబు, చిట్టిమూరి బాలు, మడికి సోమరాజు, పిల్లి బాబ్జి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి 15 రోజుల రిమాండ్

కిర్లంపూడి: వివాహితను లైంగిక వేధింపులకు గురి చేసిన వ్యక్తికి శుక్రవారం ప్రత్తిపాడు కోర్టు 15 రోజులు రిమాండ్ విధించినట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. కృష్ణవరం గ్రామానికి చెందిన 25 ఏళ్ల మహిళను అదే గ్రామానికి చెందిన రమణ పలుమార్లు లైంగిక వేధింపులకు గురిచేశాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కిర్లంపూడి ఎస్సై జి.సతీష్ కేసు నమోదు చేశారు. నిందితుడిని ప్రత్తిపాడు కోర్టుకు తరలించగా 15 రోజుల రిమాండ్‌ను విధించారన్నారు. హెడ్‌కానిస్టేబుల్ చక్రవేణి, సిబ్బంది ఉన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- 17 నీటి సంఘాలు
- 138 మంది సభ్యులు
- మొత్తం 17,331 మంది ఓటర్లు



ప్రత్తిపాడు లయన్స్ కమ్యూనిటీ హాలులో ఎన్నికల నిర్వహణపై శిక్షణ తరగతులకు హాజరైన ఎన్నికల అధికారులు (ఫైల్)

ప్రత్తిపాడు: సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ప్రభుత్వం సాగు నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 14వ తేదీన ఎనిమిది సాగు నీటి సంఘాలకు, తొమ్మిది డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు జరుగనున్నాయి. మండలంలో సాగునీటి ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులను ఇటీవలే నిర్వహించారు. మిగిలిన ఏర్పాట్లకు సంబంధించిన సన్నాహాలు చురుగ్గా జరుగుతున్నాయి. బుధవారం విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం ఈనెల 14న 8 సాగునీటి సంఘాలకు, 9 డిస్ట్రిబ్యూటరీ సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలు రెండు విభాగాలుగా నిర్వహించనున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. 14 ఉదయం సాగునీటి సంఘ సభ్యుల (ప్రాదేశిక సభ్యులు) ఎన్నిక ఉంటుంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆయా సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికల నిర్వాహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, నీటి పారుదల శాఖ ఏఈఈ ఎస్‌కే అబ్రహం తెలిపారు.

ఎన్నిక ఇలా..

18 ఏళ్లు నిండిన వారు ఎన్నికల్లో పోటీ చేయవచ్చు. ప్రభుత్వ ఉద్యోగి, పింఛనుదారు పోటీకి అనర్హులు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నావారు, పారితోషికాలు పొందేవారు అనర్హులు. ఎన్నికను మూడు విధాలుగా నిర్వహించనున్నారు. తొలుత అక్షర మాల ప్రకారం అభ్యర్థుల వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు. ముందుగా ఏకగ్రీవమవుతుందేమో చూస్తారు. లేకుంటే అభ్యర్థుల వరుస క్రమం ప్రకారం వేదికపైకి అభ్యర్థిని పిలిచి చేతులు పైకి ఎత్తే విధానంలో ఎన్నిక జరుగుతుంది. ఎవరికి ఎక్కువ మద్దతు వస్తే వారిని విజేతలుగా ప్రకటిస్తారు. చేతులెత్తే విధానం వీలు పడకపోతే రహస్య బ్యాలెట్‌ను అనుసరిస్తారు. ఓటు వేసే రైతుకు పట్టాదారు పాస్ పుస్తకం, ఓటరు కార్డు, ఆధార్ కార్డు, ఏ ఇతర గుర్తింపు కార్డుతోనైనా ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

మండలంలో..

ప్రత్తిపాడు మండలంలోని ప్రధాన జలాశయమైన మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టు సుబ్బారెడ్డి సాగర్, పుష్కర ఎత్తిపోతల పథకం, ఎనిమిది చిన్న తరహా సాగునీటి చెరువుల ఆయకట్టు నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టు సుబ్బారెడ్డి సాగర్ పరిధిలో ఆరు సంఘాల్లో 72 ప్రాదేశిక సభ్యుల ఎన్నికకు 10,690 మంది ఓటర్లు, ఎనిమిది చిన్ననీటి తరహా సాగునీట చెరువులకు 48 ప్రాదేశిక సభ్యులకు 1,859 మంది ఓటర్లు, పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్ కింద మూడు సంఘాలలో 18 ప్రాదేశిక సభ్యులకు 4,782 మంది రైతులు వెరసి 17 సాగునీటి సంఘాలలో 138 ప్రాదేశిక సభ్యుల ఎన్నికలో 17,331 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

16 సాగునీటి సంఘాలకు నేడు ఎన్నికలు

తొండంగి: మండలంలోని సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ మురార్జీ శుక్రవారం తెలిపారు. మండల వ్యాప్తంగా 16 సాగునీటి సంఘాలు ఉన్నాయన్నారు. మొత్తం 16,532 మంది ఓటర్లు ఉండగా వీరిలో మహిళా ఓటర్లు 6497 మంది, పురుషుల ఓటర్లు 10035 మంది ఉన్నారన్నారు. ప్రిసైడింగ్ అధికారులు, ఏపీవోలు తొమ్మిది టీమ్‌లుగాను, ఎన్నికల సిబ్బంది 45 టీములుగా ఏర్పాటు చేశామన్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ ఎన్నికల ప్రక్రియ జరుగుతాయన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, తిరస్కరణ, సంఘాల సభ్యులు, ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ల ఎంపిక ప్రక్రియలు జరుగుతాయన్నారు. ఎటువంటి వివాదాలకు తావులేకుండా ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు చేతుల మీదుగా స్టడీ మెటీరియల్స్‌ను శుక్రవారం విద్యార్థులకు అందజేశారు. సంకల్ప 2025 కార్యక్రమంలో భాగంగా ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు వీటిని అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిట్టిబాబుకు డాక్టరేట్ ప్రదానం



తొండంగి: ఎ.కొత్తపల్లికి చెందిన అధ్యాపకుడు వనపర్తి చిట్టిబాబు ఆంధ్రా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఈ విషయాన్ని ఆయన శుక్రవారం విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం అనకాలపల్లి జిల్లా యలమంచిలి డిగ్రీ కళాశాలో అధ్యాపకుడిగా పని చేస్తున్న ఆయన ఆంధ్రాయూనివర్సిటీలో పీహెచ్‌డీలో 'జీవిత బీమా సంస్థలో వ్యవస్థ సామర్థ్యంపై మానవ వనరుల నిర్వహణ ప్రభావం ' అంశంపై పరిశోధన చేశారు. ఈ మేరకు ఆంధ్ర యూనివర్సిటీ ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన ఆయన డాక్టరేట్ సాధించడంపై కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా హనుమద్వ్రతం



ఏలేశ్వరంలో హనుమాన్ చాలీసా పఠిస్తున్న మహిళలు



అభయాంజనేయ స్వామి వారికి సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న దంపతులు

ఏలేశ్వరం: శ్రీరామదూత హనుమద్వ్రతం నియోజక వర్గ వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో ఆంజనేయుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని షిర్డినగర్‌లోని గాంధీజీ విగ్రహం సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద హనుమద్వ్రతం ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి కటకం కిరిటీ, దుర్గావాహిని, మాతృశక్తి మహిళా సంఘాల ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పఠనం, లలితాసహస్ర నామాలు, శ్రీరామంజనేయులు భక్తి పాటలు ఆలపించారు. కార్యక్రమంలో పి.దేవి, కె.ఇందిరా, మంగమణి, రమాదేవి, కామాక్షి, గూడవల్లి అర్జునరావు, ఉడతల రమణారావు, అడపా వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో హనుమాన్ జంక్షన్ వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. స్థానిక మార్కెట్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. లింగంపర్తి , యర్రవరంలో వేడుకలు నిర్వహించారు.

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరంలో జువ్వల వారి రామలయం వద్ద హనుమత్ వ్రతాన్ని శుక్రవారం ఆలయ కమిటీ ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. జువ్వల మణీంద్ర, రజిత దంపతులు పీట మీద కుర్చుని ప్రత్యేక పూజలు చేశారు. ఏకాహం నిర్వహించిన మహిళా భజన కళాకారులను వీరవెంకట విజయ దుర్గ నాట్యమండలి అధ్యక్షుడు సానా నూకరాజు నాయుడు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎ.రాజు, సానా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: అచ్చుతాపురం గ్రామంలో ఉన్న అభయాంజనేయ స్వామివారి వ్రతాన్ని శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు సోడసాని వెంకటేశ్, గెడ్డం హరిప్రసాద్ ఆధ్వర్యంలో అర్చక స్వాములు నేతి ఫణికుమార్ మంత్రోచ్చరణలతో పలువురు దంపతులు సామూహిక వ్రతాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సత్యదేవుని సన్నిధిలో ఎస్పీ విక్రాంత్ పాటిల్



జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు సత్యదేవుని ఫొటో అందజేస్తున్న పీఆర్వో కొండలరావు



రౌతులపూడి పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ

అన్నవరం: కాకినాడ జిల్లా పోలీస్ ఆఫ్ సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్ శుక్రవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులందజేయగా, స్వామివారి ప్రసాదం, చిత్రపటాలను పీఆర్వో కె.కొండలరావు అందజేశారు.

అన్నవరం పోలీస్‌స్టేషన్ పరిశీలన

అంతకు ముందు స్థానిక పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కార్తికమాసంలో సత్యదేవుని ఆలయానికి విచ్చేసిన లక్షలాది మంది భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సేవలందించిన స్థానిక పోలీసులను, ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ శ్రీహరిబాబులను అభినందించారు. దేవస్థానానికి మరో ఇద్దరు పోలీస్‌లను కేటాయించనున్నట్టు తెలిపారు.

రౌతులపూడి: స్థానిక పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతనంగా ఏర్పాటైన పోలీస్ స్టేషన్ నుంచి కేసులు నమోదు, పరిపాలన విభాగం , సిబ్బంది కొరత, తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భగా విలేకరులతో మాట్లాడుతూ స్టేషన్ పరిపాలనా విభాగానికి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. సిబ్బంది కొరత ఉందని దీనిపై ఉన్నతాధికారులకు నివేదించి త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి, అక్రమ మద్యం, తయారీ, రవాణా వంటి అసాంఘిక చర్యలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు, రౌతులపూడి ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి జైలు శిక్ష

కిర్లంపూడి: హత్యాయత్నానికి పాల్పడిని ముగ్గురు వ్యక్తులకు శుక్రవారం ప్రత్తిపాడు కోర్టు 15 రోజులు రిమాండ్ విధించినట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం .. మండల పరిధి కృష్ణవరం గ్రామానికి చెందిన సతీష్ తన భార్యతో అదే గ్రామానికి చెందిన రమణకు అక్రమ సంబంధం ఉందనే అనుమానంతో తన సోదరుడు రాజు, బావమరిది శివతో కలిసి హతమార్చేందుకు ప్రయత్నించారు. తమ పొలంలో మోటారు పంపు బాగుజేయాలని రమణను నమ్మించి బూరుగుపూడిలోని అయ్యప్ప స్వామి గుడికి సమీపంలో ఉన్న పొలాల బాటలోకి తీసుకెళ్లారు. తమతో తీసుకొచ్చిన గెడ్డం గీసుకునే కత్తితో రమణపై ఒక్కసారిగా దాడి చేశారు. రమణ వారి నుంచి తప్పించుకుని పారిపోయాడు. దీంతో ముగ్గురు వ్యక్తులు రమణ తీసుకొచ్చిన మోటారుసైకిల్‌పై పెట్రోల్ పోసి తగలబెట్టారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై జి.సతీష్ తమ పోలీసులు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని హత్యాయత్నాకి పాల్పడిన సతీష్, రాజు, శివలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి ప్రత్తిపాడు కోర్టుకు తరలించారు. సదరు ముగ్గురు వ్యక్తులను 15 రోజులు రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

మామిడి, జీడిమామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులు



ఎస్ఎస్ పట్నంలో మామిడి రైతులకు సూచనలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి అరుణ్‌కుమార్

రౌతులపూడి: ప్రస్తుత తరుణంలో మామిడి, జీడిమామిడి తోటల్లో రైతులంతా యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానవన శాఖ అధికారి పి.అరుణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎస్ఎస్ పట్నంలో రైతులు సాగు చేస్తున్న మామిడి, జీడిమామిడి తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మామిడిలో మొగ్గలను ఉత్తేజపరిచి త్వరగా పూతరావటానికి, ఆడ పువ్వులు శాతం పెంచడానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. వీటి కోసం పొటాషియం నైట్రేట్ పది గ్రాముల పొడరును, ఒక లీటరు నీటిలో కలపి పిచికారీ చేయాలన్నారు. లేదా జోరాన్ రెండు గ్రాముల పొడరును ఒక లీటరు నీటిలో కలపి పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక ఉద్యానవన సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నా తొలి ప్రయత్నాన్ని ఆశీర్వదించండి

- ప్రతి ఒక్కరూ తండ్రులకు గౌరవం ఇవ్వండి
- నూతన హీరో హర్షవర్ధన్



ఆదిత్య యూనివర్సిటీలో మాట్లాడుతున్న సినీ హీరో హర్షవర్ధన్

గండేపల్లి: నా ఈ తొలి ప్రయత్నాన్ని ఆశీర్వదించాలని నూతన హీరో (తొలి పరిచయం) హర్షవర్ధన్ కోరారు. మనీషా ఆర్ట్స్ అండ్ మీడియా, అన్నపరెడ్డి స్టూడియోస్ బ్యానర్లపై నిర్మించిన ఎల్‌వైఎఫ్ (లవ్ యువర్ ఫాదర్) సినిమా ఆడియో రిలీజ్‌ను మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శుక్రవారం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా సినిమాలో ఒక పాటను యూనివర్సిటీ ఛాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి ఆయన చేతుల మీదుగా విడుదల చేసి నటీనటులకు, చిత్రం యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. హర్షవర్ధన్ మాట్లాడుతైనా తొలి చిత్రాన్ని ఆదరించాని కోరారు. ప్రతి ఒక్కరూ ఫాదర్స్‌కు రెస్పెక్ట్ ఇవ్వడం మర్చిపోవద్దన్నారు. చిత్ర దర్శకుడు పవన్ కేతరాజు మాట్లాడుతూ ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందని, పుష్ప-2 చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశానని, ఈ చిత్రాన్ని స్వీయ కథతో దర్శకత్వం చేస్తున్నట్టు తెలిపారు. హీరోయిన్ కాశికా కపూర్, నటీనటులు భద్రం, రఘుబాబు, షకలక శంకర్, తదితర నటులు సహాయక తారాగణంలో ఉన్నారని, మణిశర్మ సంగీత అందిస్తుండగా, శ్యామ్ కె.నాయుడు సినిమాటోగ్రఫీ వహిస్తున్నట్టు వివరించారు. ఈ చిత్రాన్ని తానే రచించినట్టు పేర్కొన్నారు.

జాతీయ కాపు సంఘం రాష్ట్ర యువత ఉపాధ్యక్షుడిగా సూరపురెడ్డి



సూరపురెడ్డి శ్రీనివాస్‌ను అభినందిస్తున్న సభ్యులు

తుని: పట్టణానికి చెందిన సూరపురెడ్డి శ్రీనివాస్‌కి జాతీయ కాపు సంఘంలో కీలక పదవి దక్కింది. జాతీయ కాపు సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువత ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్ నియమితులయ్యారు. శుక్రవారం మంగళగిరిలో ఆ సంఘం కేంద్ర కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు కర్న మురళీకష్ణం నాయుడు, ఉపాధ్యక్షుడు మేడిశెట్టి శేషగిరి నియామక పత్రాన్ని శ్రీనివాస్‌కు అందజేశారు. అనంతరం శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. పలువురు అభినందించారు.

సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

రౌతులపూడి: గ్రామాల్లోని భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎస్.పైడిపాల, మల్లంపేట గ్రామాల్లో డీటీ నరేష్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఆయా గ్రామంలోని ప్రజలతో భూ సంబంధిత సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రాజశేఖర్, వీఆర్‌ఓ చందుబాబు, విలేజ్ సర్వేయర్ ప్రియాంక పాల్గొన్నారు.

కిర్లంపూడి: రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. మండలంలోని చిల్లంగి, వేలంక గ్రామాల్లో తహసీల్దార్ జె.చిరంజీవి ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులను ఆర్డీఓ సందర్శించి రైతుల నుంచి పలు భూ సమస్యలపై వచ్చిన అర్జీలను ఆమె స్వీకరించారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారిని ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సాయికిరణ్, ఎంఎల్ఎస్ఓ షేక్ బషీర్, ఆర్ఐ సత్యదేవి తదితరులు ఉన్నారు.

తొండంగి: వేమవరంలో శుక్రవారం నిర్వహించి రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి 26 దరఖాస్తులు అందాయని డిప్యూటీ తహసీల్దార్ జగదీష్ తెలిపారు. భూమి సరిహద్దులో మార్పులు, సబ్‌డివిజన్, పొజిషన్ సర్టిఫికెట్లు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు తదితర సమస్యలపై 26 దరఖాస్తులందాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజారావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

లభించని పులి ఆచూకీ

- విద్యుత్ తీగలతో పులి ప్రాణాలకు ముప్పు
- అటవీ, విద్యుత్, పోలీసు శాఖలు అప్రమత్తం
- ఆరో రోజూ దొరకని పులి ఆచూకీ



బాపన్నధార గిరిజన ప్రాంతాల్లో పులి కోసం గాలిస్తున్న దృశ్యం



ఏలేశ్వరం ఫారెస్టు రేంజ్ కార్యాలయంలో అటవీ, విద్యుత్, పోలీసు శాఖ అధికారుల సమావేశం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని బురదకోట గ్రామ పంచాయతీ ఉలిగోగుల రిజర్వు ఫారెస్టులో గిత్త దూడపై దాడి చేసిన పులి ఆచూకీ ఆరు రోజులైనా లభించలేదు. పెద్ద పులి ఆచూకీ కోసం అటవీశాఖ అధికారులు, సిబ్బంది పడరాని పాట్లు పడుతున్నారు. ఆహారం కోసం గిత్తదూడ కళేభారం వద్దకు పులి వస్తుందని భావించిన అధికారులు ట్రాప్ కెమేరాలను ఏర్పాటు చేశారు. అనంతరం ధారపల్లి జలపాతం పరిసరాల్లోకి పులి వచ్చే అవకాశం ఉండడంలో ఆ ప్రాంతంలో ట్రాప్ కెమేరాలను ఏర్పాటు చేశారు. అయితే ట్రాప్ కెమేరాలకు ఎక్కడా పులి చిక్కలేదు. అలాగే పులి అలికిడి కూడా కనిపించలేదు. దీంతో పులి ఎక్కడ ఉందో ఎటు వైపు వెళ్లిందో అనే సందేహాలు అటవీ శాఖ అధికారులకు, గిరిజన ప్రజలకు అంతు పట్టని ప్రశ్నగా మిగిలింది.

విద్యుత్ తీగలతో పులి ప్రాణాలకు ముప్పు

ఉలిగోగుల రిజర్వు ఫారెస్టులో సంచరిస్తున్న పెద్ద పులి ప్రాణాలకు విద్యుత్ తీగల ఉచ్చులతో ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. దీంతో అటవీ, విద్యుత్, పోలీసు శాఖల అధికాలు అప్రమత్తమయ్యారు. జిల్లా అటవీ శాఖ అధికారి బి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలేశ్వరం ఫారెస్టు రేజ్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో ఎఫ్ఆర్‌ఓ దుర్గా రాం ప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అటవీ అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఉలిగోగుల రిజర్వు ఫారెస్టులో వన్యప్రాణుల వేట కోసం అక్రమార్కులు అమర్చిన విద్యుత్ తీగల ఉచ్చులను తొలగించారు. వన్యప్రాణుల వేట నిమిత్తం విద్యుత్ తీగల ఉచ్చులు ఏర్పాటు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఏలేశ్వరం అటవి రేంజ్ పరిధిలోని నాలుగు మండలాల్లో ఎక్కడైనా విద్యుత్ ట్రిప్ అయితే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని అధికాలను కోరారు. పులి ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్ఓ రాంప్రసాద్ సూచించారు.

ప్రజలు అప్రమత్తం

అటవీ అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది బృందాలుగా ఏర్పడి పులి సంచరించే ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. పరిసర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. వేళంగి, తాడువాయి, దోపర్తి రిజర్వు ఫారెస్టు సరిహద్దు ప్రాంతాల్లో అటవీ సిబ్బంది పులి కదలికలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పులి కదలికలు కనిపిస్తే తీసుకోవల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తున్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ డీఆర్వో జాన్సన్, ఎస్సైలు, విద్యుత్ శాఖ అధికారులు ఉన్నారు.